



శారదా పీఠానికి వైభవ వెంకటేశ్వరుని ఆలయం!?

నిర్వహణ బాధ్యతలు పీఠానికి అప్పగించాలంటూ ఆలయ కమిటీ లేఖ

- ఆగమ శాస్త్ర నిబంధనలకు వ్యతిరేకమంటున్న పూర్వ కమిటీ



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం

- 2020లోనే ఒకసారి ప్రయత్నం... అడ్డుకున్న అప్పటి కమిటీ
- ఆ తరువాత వ్యూహాత్మకంగా దేవదాయ శాఖకు అప్పగింత
- ఇప్పుడు పీఠానికి అప్పగించాలంటూ లేఖలు
- తెర వెనుక అధికార పార్టీ నేతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

శారదా పీఠం ప్రముఖ ఆలయాలపై దృష్టి సారిస్తోంది. విశాఖలో పేరొందిన ఆలయాల నిర్వహణ బాధ్యతలు దేవదాయ శాఖ నుంచి తప్పించి పీఠానికి దఖలు పడేలా పావులు కదుపుతోంది. గతంలో సీతమ్మధారలోని షిర్డీ సాయి ఆలయాన్ని ఈ విధంగానే కొన్నాళ్లు నిర్వహించింది. ఆ తరువాత మళ్లీ అది దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది. ఇప్పుడు కప్పరాడలోని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంపై పీఠం దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని శారదా పీఠానికి అప్పగించాలని కోరుతూ ఆలయ కమిటీ ఇటీవల దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. దాని ప్రకారం ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రభుత్వ పెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. దీనిని మరో వర్గం వ్యతిరేకిస్తోంది. పీఠాలకు ఆలయాల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం తగదని, దేవదాయ శాఖ పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశంపై శనివారం తెలుగుదేశం పార్టీకి చెందిన పులువురు ఆలయం వద్ద ధర్నా చేశారు.

ఇదీ ఆలయ చరిత్ర

కప్పరాడ (విశాఖ ఉత్తర నియోజకవర్గం)లో ఆలయ నిర్మాణం కోసం 1964లో వెంకటేశ్వరస్వామి భక్తురాలైన పూల వెంకట రమణమ్మ ఎకరా స్థలం ఇచ్చారు. కప్పరాడ సర్వే నంబరు 9లోని ఈ భూమి కోసం విల్లు రాసి రిజిస్టర్ చేశారు. ఆ తరువాత ఒక కమిటీ ఏర్పాటై 1999లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. 2002లో ఆలయం పూర్తయి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. దీనికి శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంగా నామకరణం చేశారు. ఆ తరువాత దశల వారీగా ఆలయాన్ని అభివృద్ధి చేశారు. రాజగోపురాలు, శేషవాహనం, ముఖ మండపం, గోశాల, నాలుగు అంతస్థుల అన్నదాన సత్రం వంటివి నిర్మించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఇక్కడ పూజలు, సేవలు, కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

భారీగా ఆస్తులు

ఈ ఆలయానికి మూడు కిలోల బంగారు ఆభరణాలు, 100 కిలోల వెండి వస్తువులు, బ్యాంకుల్లో రూ.80 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఆలయానికి వీఐపీ భక్తుల తాకిడి ఎక్కువ. ఏడాదికి సుమారు కోటి రూపాయల ఆదాయం వస్తుంది.

మూడేళ్ల క్రితమే ప్రణాళిక

వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంచి పేరు ప్రతిష్ఠలతో పాటు ఆదాయం కూడా అధికంగా ఉండడంతో దీనిపై శారదా పీఠం కన్ను పడింది. 2020లోనే దీనిని స్వాధీనం చేసుకోవడానికి పావులు కదిపారు. అప్పగించాలని ప్రభుత్వ పెద్దలను కోరారు. అయితే అప్పటికి ఆలయం స్థానిక కమిటీ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఆలయం నిర్మించిన నాటి నుంచి 2020 వరకు స్థానిక పెద్దలే కమిటీగా ఏర్పడి నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. పీఠానికి ఆలయం అప్పగించాలని వైసీపీ నాయకులు కోరగా, ఒక వర్గం... మిగతా 6వ పేజీలో

ఆది నుంచీ అవమానాలే..

ఏయూలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమతకు దక్కని కనీస గౌరవం

- ఉద్దేశపూర్వకంగా కొంతమంది నిర్లక్ష్యం
- చార్జ్ తీసుకునేందుకు ఛాంబర్‌కు వెళ్లకుండా అడ్డగింత
- మూడు రోజుల వరకూ వాహనం కూడా ఇవ్వని వైనం
- వైస్ చాన్సలర్‌కు చెప్పకుండానే కీలక నిర్ణయాలు
- యూనిఫెస్ట్ నిర్వహణకు సంబంధించిన సమాచారం నిల్



ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమత

- వాట్సాప్‌లో ఆహ్వానం
- కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా?... అంటూ ప్రశ్నించిన ఇన్‌చార్జి వీసీ
- నోరు తెరిస్తే వర్సిటీ పరువు బజారున పడుతుందని బాధను దిగమింగుకుంటున్నారంటున్న సన్నిహితులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు క్యాంపస్‌లో కొందరు కనీస గౌరవం ఇవ్వడం లేదు. ఏవిషయం ఆమె దృష్టికి తీసుకువెళ్లడం లేదు. ప్రస్తుతం వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌కు సంబంధించిన సమాచారం కూడా ఆమె అడిగేంత వరకూ చెప్పలేదు. ప్రారంభోత్సవానికి ఆహ్వానం కూడా కేవలం వాట్సాప్‌లో పంపి ఊరుకున్నారు. ఈ పరిణామాలపై ఆమె మనస్తాపంతో ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిని తాను మున్నెన్నడూ చూడలేదని, వర్సిటీ పరువు పోతుందనే ఉద్దేశంతోనే సైలెంట్‌గా ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ప్రొఫెసర్ కె.సమత నవంబరు నెలాఖరులో ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు. సీనియర్ ప్రొఫెసర్ అయిన ఆమె అప్పటికి రెక్టార్‌గా ఉన్నారు. వర్సిటీలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆమె పట్ల అధికారులు, అధ్యాపకులు గౌరవ భావంతో వ్యవహరించాలి. కానీ, మాజీ వీసీకి సన్నిహితంగా మెలిగిన కొందరు ఆమెను కనీసం వీసీగా గుర్తించేందుకు అంగీకరించలేదు. చార్జ్ తీసుకునేందుకు వైస్ చాన్సలర్ ఛాంబర్‌లోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ విషయమై మీడియాలో కథనాలు రావడంతో ఉలిక్కిపడిన అధికారులు తరువాత రోజు ఆమెను వీసీ చాంబర్‌కు తీసుకువెళ్లి సీటులో కూర్చోబెట్టారు. ఇలా తొలిరోజే వివక్ష ఎదుర్కొన్నందుకు ఆమె బాధపడ్డారు. ఆ తరువాత కూడా మూడు రోజులపాటు వీసీ వాహనాన్ని ఆమెకు కేటాయించకుండా చేశారు. దీనిపై రచ్చ జరుగుతుందన్న ఉద్దేశంతో తరువాత అప్పగించారు. అయితే, కీలక నిర్ణయాలు, ఇతర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం ఆమెకు తెలియనివ్వడం లేదు. ఈ విషయమై అనేకమార్లు సన్నిహితుల వద్ద ఇన్‌చార్జి వీసీ ఆవేదన వ్యక్తం చేశారు. తన వద్దకు ఎవరూ రావడం లేదని, ఏ విషయాలు తెలియజేయడం లేదంటూ వాపోయారు. ఇక ప్రస్తుతానికి వస్తే...ఆంధ్ర యూనివర్సిటీలో శుక్రవారం నుంచి 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ... మిగతా 6వ పేజీలో

ఇన్‌చార్జి వీసీని ఆహ్వానించకపోవడంపై నిరసన

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌కు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతను ఆహ్వానించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ శనివారం ఉదయం క్యాంపస్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పలువురు నిరసన తెలియజేశారు. ఏయూ డాక్టోరల్ ఫోరం అధ్యక్షులు ఎం.సురేష్ మీనన్ నిరశన దీక్షలో కూర్చోగా, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అర్జునుడు, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ మోహమ్, డాక్టర్ పాల్ ప్రతాప్, తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మీనన్ మాట్లాడుతూ వీసీని అవమానించేలా వ్యవహరించడం దారుణమన్నారు. పూర్తిస్థాయి వీసీగా బాధ్యతలు అప్పగించి ఆమె గౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టాలన్నారు.

వైసీపీలో గందరగోళం!



ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- సిట్టింగ్‌లకు టికెట్ కేటాయింపుపై కానరాని స్పష్టత
- ఇప్పటికే 'గాజువాక' సమన్వయకర్త మార్పు
- పెందుర్తి నుంచి మరోసారి అవకాశం ఉండబోదని అదీప్‌రాజ్‌కు సంకేతాలు?
- 'సౌత్'లో వాసుపల్లి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న సొంత పార్టీ కార్పొరేటర్లు
- భీమిలిలో ముత్తంశెట్టికి ఇంకా లభించని గ్రీన్‌సిగ్నల్
- మరోవైపు ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషణ
- ఒక దశలో ముత్తంశెట్టి, అదీప్‌రాజ్‌లలో ఒకరిని బరిలోకి దింపాలని ప్రతిపాదన
- ఇద్దరూ ససేమిరా అన్నట్టు సమాచారం



వాసుపల్లి గణేష్‌కుమార్



అదీప్‌రాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. పార్టీలో టికెట్ల కోసం విపరీతమైన పోటీ ఉందంటూ నిన్నమొన్నటివరకూ బిల్డప్ ఇచ్చిన నేతలు... ఇప్పుడు అభ్యర్థుల కోసం గాలింపు మొదలెట్టినట్టు తెలిసింది. ఈ క్రమంలో జిల్లాలో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన నియోజకవర్గాల నుంచి రోజుకొకరి పేరు ప్రచారంలోకి వస్తోంది. ఎంపీ అభ్యర్థి కోసం కూడా అధిష్ఠానం అన్వేషణలో ఉంది.

జిల్లాలో ఆరు నియోజకవర్గాలు పూర్తిగా, పెందుర్తి నియోజకవర్గం పాక్షికంగా ఉన్నాయి. 2019 ఎన్నికల్లో తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, గాజువాక, భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. విశాఖ లోక్‌సభ స్థానాన్ని వైసీపీ స్వల్ప ఆధిక్యంతో దక్కించుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి వైసీపీ పంచన చేరిపోయారు. ప్రస్తుతం వాసుపల్లికి, నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లకు పొసగడం లేదు. ఇక భీమిలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన ముత్తంశెట్టి శ్రీనివాసరావును రెండేళ్ల కిందట మంత్రివర్గం నుంచి తొలగించారు. తర్వాత జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చినప్పటికీ కొంతకాలానికే అందులో నుంచి తీసేశారు.దీంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు డీలాపడిపోయాయి. ఇకపోతే పెందుర్తి, గాజువాక ఎమ్మెల్యేల పనితీరుపై అధిష్ఠానం సంతృప్తికరంగా లేదు.

వచ్చే ఎన్నికల్లో సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తామంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలా మందికి సిట్టింగ్‌లకు నో చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి టికెట్ ఇవ్వడం లేదని చెప్పి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును సమన్వయకర్తగా ప్రకటించారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కూడా అక్కడ టికెట్ ఇవ్వడం లేదని ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్‌లను తీసేస్తే వారి స్థానంలో ఎవరిని తెచ్చి పెడతారోనని ఆయా నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి నేతలు ఆందోళన చెందుతున్నారు. దక్షిణ నియోజకవర్గ టికెట్ వాసుపల్లికి ఇస్తే తాము సహకరించేది లేదంటూ కార్పొరేటర్లు బహిరంగంగానే చెప్పడం, కొంత మంది కార్పొరేటర్లు ఇప్పటికే పార్టీని వీడి వెళ్లిపోవడంతో అధిష్ఠానం ... మిగతా 6వ పేజీలో



అంగన్‌వాడీల నిరవధిక దీక్ష

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం రాత్రి శిబిరంలోనే నిద్రపోయి దీక్ష సాగిస్తున్న అంగన్‌వాడీలు

- వార్త I పేజీలో



కప్పరాడ వద్ద రోడ్డుపై చెత్త

పేరుకుపోతున్న చెత్త

పారిశుధ్య కార్మికుల సమ్మెతో నగరంలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. తమ డిమాండ్ల సాధన కోసం గత నెల 26 నుంచి జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. వారి స్థానంలో నియమితులైనవారు చెత్త తరలించేందుకు యత్నించడంతో శనివారం వన్‌టౌన్‌లో కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురి కార్మికులు, సంఘ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. - విశాఖపట్నం

నేడే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'

ముత్యాల ముగ్గుల పోటీలు

- టీపీటీ కాలనీలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహణ
- ఉదయం 10 గంటలకు ప్రారంభం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏటా మాదిరిగా 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు...రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో



ఆదివారం ఉదయం నగరంలోని సీతమ్మధార టీపీటీ కాలనీలో గల శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో జరగనున్నాయి. స్థానికంగా 'సీఎంఆర్ స్పాన్సర్ చేస్తోంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు ఇవ్వనున్నారు. ఇకపోతే, పోటీలో మహిళలు మాత్రమే పోటీల్లో పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రిని పోటీదారులే తెచ్చు కోవాలి. రెండు గంటల్లోగా ముగ్గు వేయాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. పోటీల్లో పాల్గొన దలచిన వారు మరిన్ని వివరాలకు ఈ 9985411659, 9492452283 నంబర్లకు సంప్రతించాలి. ఉదయం 9 గంటలకల్లా ప్రాంగణానికి చేరుకోవాలి. కచ్చితంగా పది గంటలకు పోటీ ప్రారంభమవుతుంది.

ఇన్నాళ్లకు గుర్తొచ్చామా...?

- విజినిగిరిపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టిని నిలదీసిన గ్రామస్థులు
- పంచగ్రామాల భూ సమస్య పరిష్కారంలో విఫలమయ్యారంటూ ధ్వజం



ముత్తంశెట్టిని చుట్టుముట్టిన గ్రామస్థులు

సింహాచలం, జనవరి 6: భీమునిపట్నం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావును జీవీఎంసీ 98వ వార్డులోని విజినిగిరిపాలెంలో చేదు అనుభవం ఎదురైంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామానికి వెళ్లిన ఆయనకు తీవ్ర నిరసన ఎదురైంది. '2019 ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చారు. మళ్లీ ఇన్నాళ్లకు మేము గుర్తొచ్చామా, పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నేరవేర్చడంలో విఫలమయ్యారు'...అంటూ ఆయన్ను మహిళలు చుట్టుముట్టారు. ముందుకు కదలకుండా అడ్డుకునేందుకు యత్నించారు. అయితే పోలీసులు రక్షణ కవచంలా నిలిచారు. భూ వివాదం కోర్టులో ఉన్నందున పరిష్కారంలో జాప్యం అవుతోందని ఎమ్మెల్యే సర్దిచెప్పబోయారు. అయినా శాంతించని గ్రామస్థులు గత ఎన్నికల సమయంలో సమస్య పరిష్కరిస్తామని తమకు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని గుర్తుచేశారు. ఆ సమస్య కారణంగా తమకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, తదితర రాయితీలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట వెళ్లిన వైసీపీ నేతలు ఎర్ర వరంబాబు, కొలుసు ఈశ్వరరావు, దాసరి కనకరాజులు భూ సమస్య స్థితిగతులను గ్రామస్థులకు వివరించి కార్యక్రమం కొనసాగించేందుకు కృషిచేశారు. కాగా, ఈ సందర్భంగా 98వ వార్డు జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు సారథ్యంలో కార్యకర్తలు పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.

కేజీబీవీ టీచర్ల తొలగింపు

- అనకాపల్లి జిల్లాలో 14 మంది, అల్లూరి జిల్లాలో 125 మంది...
- నేడు కొత్తవారికి నియామక పత్రాలు
- సమగ్ర శిక్ష అభియాన్ పాజెక్టు అధికారుల తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేసే 14మంది టీచర్లను తొలగిస్తూ శనివారం సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వీరి స్థానంలో ఆదివారం కొత్తవారిని నియమించి, సోమవారం విధుల్లో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేజీబీవీ టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు మొత్తం 125 మందిని తొలగించారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేలా అధికారులు చూడాలి తప్ప... బెదిరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం విజయవాడలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ ముట్టడి సందర్భంగా ఉద్యోగుల తొలగింపు, షోకాజ్ నోటీస్ జారీ వంటివి ఉండబోవని జేఏసీ నాయకులకు ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. అయితే అందుకు భిన్నంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలువురు అధికారులు వ్యవహరించడంపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందుకు కేజీబీవీ టీచర్ల సంఘ నేతగా ... మిగతా 6వ పేజీలో

తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎన్నికల అధికారి, పరిశీలకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 6: తైక్వాండో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పి.అచ్యుతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని లయన్స్ క్లబ్‌లో శనివారం జరిగిన ఎన్నికలలో కోశాధికారిగా బి.అర్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎం.అచ్చెన్నాయుడు, నాయబ్ రసూల్, సంయుక్త కార్యదర్శులుగా దొరబాబు, కొమర భాస్కరరావు, కె.జగన్మోహనరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాసరావు, ఎం.సాయిబాబా, అంకంరావు, లింగేశ్వర్, జ్యోతి ఎన్నికయ్యారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (సీబీడీ) నమ్మి శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఒలింపిక్ సంఘం ప్రతినిధి ఎంవీ.మాణిక్యాలు, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కె.శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారని రాష్ట్ర సంఘం కార్యదర్శి వేణుగోపాలరావు తెలిపారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం

సీతమ్మధార, జనవరి 6: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 46వ వార్షిక సమావేశం, కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత డీజీపీ సి.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ తెలుగు వారి చరిత్ర లిఖించడంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన మల్లంపల్లి సోమశేఖర్‌శర్మ, బీఎస్ఎల్ హనుమంతరావు విశిష్ట సేవలు అందించారన్నారు. కాకతీయ రాజుల అనంతరం ఉభయ రాష్ట్రాల సమగ్ర చరిత్రను అందించారన్నారు. చాలా మంది భావిస్తున్నట్టుగా వేదాలు మన సంస్కృతి పునాదులు కాదని, బుద్ధిజం, జైనిజం తెలుగువారి సంస్కృతి పునాదులని ఈ మేధావులు తెలిపారన్నారు. బ్రిటిష్ వారు దేశానికి వచ్చిన నాటికి మన గతమంతా ఊహాజనితత్వంతోనే మరుగున పడిపోయిందన్నారు. వాగాడంబరతతో గ్రామాల కోసం లిఖించిన కైఫీయతులు, దైవక్షేత్రాల స్థల పురాణాలు మాత్రమే ఉండేవని వివరించారు. ఊహాజనిత రచనల నుంచి వాస్తవాలను వేరుచేసి వాస్తవాలతో బేరీజు వేసుకొని విన్సెంట్స్ స్మిత్, కల్నల్ టాడ్, రాబర్ట్ సూయల్ వంటి చరిత్రకారులు దేశ చరిత్ర రచించారని, అయితే వారు మన ప్రాంతీయ చరిత్రలను విస్మరించారని వ్యాఖ్యానించారు. మరో అతిథి ప్రొఫెసర్ వకుల భరణం రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్థకు పరిచయం చేశారు. కళల ప్రాముఖ్యత కాలక్రమేణా తగ్గిపోతోందని, ఆర్ట్స్ సబ్జెక్టులను అర్థం


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ ఆంజనేయరెడ్డి

చేసుకోవడం ముఖ్యమన్నారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ కె.సమత బుల్లయ్య కళాశాల సావనీర్‌ను విడుదల చేశారు. నగర చరిత్ర, సంస్కృతి మూలాన్ని వివరించారు. సమావేశంలో కళాశాల అధ్యక్షుడు కేజీ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీహెచ్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జె.లక్ష్మణబాబు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ హెడ్ పీఎం శరత్‌కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీని మరోసారి ఆదరించండి

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- ఉత్తర నియోజకవర్గంలో సామాజిక సాధికార యాత్ర

అక్కయ్యపాలెం, జనవరి 6: రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ఆధ్వర్యంలో కైలాసపురం పోర్టు ఆస్పత్రి ఎదుట రహదారిపై శనివారం సామాజిక సాధికార యాత్రలో భాగంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. మేయర్ హరి కుమారి మాట్లాడుతూ వైఎస్ మహిళలకు రాజకీయం ప్రాధాన్యమిచ్చారని, అతని బాటలోనే జగన్ నడుస్తున్నారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ప్రజల సమస్యలను తెలుసుకోవడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు,



సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, తదితరులు ప్రసంగించారు. అంతకుముందు మాధవధార వుడా కాలనీ గ్రాండ్ మిలన్ ఫంక్షన్ హాల్ నుంచి బైక్ ర్యాలీ, బస్సు యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.


సభ ప్రారంభం కాకముందే ఇళ్లకు వెళ్లిపోతున్న మహిళలు

ప్రారంభానికి ముందే వెనుతిరిగిన మహిళలు

అక్కయ్యపాలెం: పోర్టు ఆస్పత్రి ఎదుట రహదారిపై శనివారం నిర్వహించిన వైసీపీ బహిరంగ సభ ప్రారంభం కాకముందే మహిళలు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా నాయకులు ఆలస్యంగా రావడంతో కొద్ది మంది వెళ్లిపోయారు. ఓ వైపు సభ జరుగుతుండగా మహిళలు బారికేడ్లు దాటేందుకు యత్నించగా నాయకులు నిలువరించారు. పిల్లలను ఇంటివద్ద వదిలి వచ్చామంటూ ఆగ్రహం వ్యక్తం చేసినా బారికేడ్లు తీయకుండా నిరోధించారు. కాగా సభకు వచ్చిన వారికి బిస్కెట్ ప్యాకెట్, డ్రింక్ బాటిల్స్‌ను గాలిలోకి విసిరివేయడంపై పలువురు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ

మర్రిపాలెం, జనవరి 6: స్థానిక రైతుబజార్‌లో అర్హులైన రైతులకు శనివారం మార్కెటింగ్ అధికారి షేక్‌యాసిన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. జేసీ ఆదేశాల మేరకు రైతుల భూములు, పంటలను రెవెన్యూ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులతో పరిశీన చేయించి, అర్హులను గుర్తించి కార్డులను అందజేశామన్నారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.


కార్డులు అందిస్తున్న యాసిన్

వైద్య శిబిరానికి విశేష స్పందన

పూర్ణామార్కెట్, జనవరి 6: గ్రేటర్ 39వ వార్డు కన్వేయర్ బెల్ట్ వద్ద వేదాంత గూడ్స్ కార్గో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కనకమహాలక్ష్మి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికుల ఆరోగ్య ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేసి, నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించడం శుభ పరిణామమన్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి మందులను అందజేశారు. శిబిరంలో వేదాంత కార్గో గూడ్స్ మేనేజర్ జేఎస్ లక్ష్మి, ఎఫ్ఎక్స్‌బీ సురక్షా మేనేజర్ వై.అశోక్, గాయత్రి మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో ఏఎంసీ ప్రిన్సిపాల్, తదితరులు

మహారాణిపేట, జనవరి 6: సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర మెడికల్ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్ షిప్‌లు ఇచ్చేందుకు ఛేజ్ ఇండియా సంస్థ సీఎస్ఆర్ నిధులను అందజేసింది. ఇంజనీరింగ్, మెడిసిన్, డిప్లమో, నర్సింగ్, తదితర విభాగాల్లో చదువుతున్న సుమారు 192 మంది విద్యార్థులకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు స్కాలర్‌షిప్‌లను అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు విద్య ఒక్కటే మార్గమని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి స్కాలర్‌షిప్‌లను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఛేజ్ ఇండియా సీఈవో శ్యామ్, సృజనవాణి వైస్ ప్రెసిడెంట్ జి.ఉమాశంకర్, డాక్టర్ జయసుమ, డాక్టర్ కేవీ రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మి రథోత్సవం

జగదాంబ కూడలి, జనవరి 6: మార్గశిర మాసోత్సవాల సందర్భంగా వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దత్తత దేవాలయం శ్రీరామచంద్రస్వామి ఆలయం వద్ద దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో కనకమహాలక్ష్మి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. ఈవో కె.శిరీష, ఏఈవో తిరుమలేశ్వరరావు, చైర్మన్ సింహాచలం, సభ్యులు ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళలు కలశాలతో రథం వెంట నడిచారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


రథోత్సవంలో ఎమ్మెల్యే వాసుపల్లి, ఈవో శిరీష, తదితరులు

ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్వర్ణోత్సవం


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


సీతమ్మధార, జనవరి 6: స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాల 50 వసంతాల ఉత్సవాలను శనివారం నిర్వహించారు. సావనీర్‌ను ప్రిన్సిపాల్ ఫాదర్ పి.మనోజ్ అధ్యక్షతన అతిథులు మెటా వైస్ ప్రెసిడెంట్ సంధ్య దేవనాదన్, ఖమ్మం అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, గొండు సీతారాం ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు భాగస్వాములయ్యారు.

ద్వారకా సీఐగా రమేష్ బాధ్యతలు

సీతంపేట: ద్వారకా సీఐగా ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా ఖాళీగా ఉన్న స్థానంలో సీసీఎస్ 1 సీఐ ఎస్.రమేష్‌ను సీపీ నియమించారు. ఇతను గతంలో పెందుర్తి క్రైమ్ సీఐగా, పీఎం పాలెం ట్రాఫిక్ విభాగం, ఏసీబీలో పనిచేశారు.

'విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం'

అక్కయ్యపాలెం, జనవరి 6: విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైసీపీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు మేయర్ హరి కుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముక్కా శ్రావణి, బానాల శ్రీనివాసరావు, శశికళ, పద్మారెడ్డి, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డీఈవో చంద్రకళ, జీవీఎంసీ డీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


పాఠశాల భవనం ప్రారంభిస్తున్న మేయర్

సామాజిక న్యాయం కోసమే బస్సు యాత్ర

సీతమ్మధార: వైసీపీ సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయంపై ప్రజలకు వివరించేందుకు సామాజిక బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఉత్తర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు, సంక్షేమ పథకాల అమలు తెలియజేస్తున్నామన్నారు. మూడో విడత యాత్ర ఉత్తర నియోజకవర్గంలో ప్రారంభమయిందని, మూడు జిల్లాల పరిధిలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి

డాబాగార్డెన్స్, జనవరి 6: సీనియర్ సిటిజన్స్ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం అందరికీ పెన్షన్ అందాలి...అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.200 పెన్షన్ ఇస్తుందని, 2.2 కోట్ల మందికి మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీనిని రూ.3 వేలకు పెంచాలన్నారు. ఏ స్కీమ్‌లోనూ లేనివారికి సార్వత్రిక పెన్షన్ రూ.8 వేలు ఇవ్వాలన్నారు. జాతీయ ఉత్పాదకతలో భాగస్వాములు కాబట్టి వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. అందరికీ పెన్షన్ సమస్యపై తీర్మానం చేశారు. సదస్సులో ఐసీఆర్ఈఏ ప్రెసిడెంట్ కె.మోహనరావు, ఫోరం ఫర్ డెవలప్‌మెంట్ నార్త్‌ఆంధ్ర ఎ.అజశర్మ, ఆర్.వెంకటరావు, బీటీ మూర్తి, వి.నరసింగరావు, ఎం.కామేశ్వరి, పీవీ సుబ్బారావు, సోల్మన్‌రాజు, ఎంఆర్‌డీ రాజు, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

శారదా పీఠానికి వైభవ వెంకటేశ్వరుని ఆలయం!?

... 5వ పేజీ తరువాయి

వ్యతిరేకించింది. మరో వర్గం అంగీకరించింది. వెంటనే ఆ కమిటీతో శారదా పీఠానికి లేఖ రాయించారు. ఆలయాన్ని తాము సరిగ్గా నిర్వహించలేకపోతున్నామని, స్వాధీనం చేసుకుని పూజాదికాలు చేయించాలన్నది దాని సారాంశం. అయితే పీఠం వెంటనే అంగీకారం తెలపకుండా పీఠాధిపతులు ఇద్దరూ రుషీకేశ్ పర్యటనలో ఉన్నారని, వచ్చాక నిర్ణయం ప్రకటిస్తామని సమాధానం ఇచ్చింది. ఈ విషయం తెలిసి మరో వర్గం ఆలయాన్ని ఇవ్వడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇలా అయితే లాభం లేదని ఒక రోజు ఆకస్మికంగా నాటి ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి, స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త కలిసి ఆలయాన్ని దేవదాయ శాఖకు అప్పగిస్తున్నామని ప్రకటించారు. ఆ వెంటనే అప్పటి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి వెళ్లి ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. 2020 సెప్టెంబరు 30న ఆలయానికి దేవదాయ శాఖ తరఫున ఈఓను నియమించారు. ఇకపై ఈఓ ఆధ్వర్యంలోనే అన్నీ జరుగుతాయని ప్రకటించి, స్థిరచరాస్తులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆలయం దేవదాయ శాఖ పర్యవేక్షణలోనే ఉంది. ఈఓ బండారు ప్రసాద్ అన్ని వ్యవహారాలు చూస్తున్నారు.

హంసలదీవిలా ఇవ్వాలని తాజాగా లేఖ

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జిల్లా హంసలదీవిలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలను శృంగేరి జగద్గురు మహా సంస్థానానికి అప్పగించింది. ఆ జీఓను అనుసరించి కప్పరాడలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శారదా పీఠానికి అప్పగించాలని ప్రస్తుత ఆలయ కమిటీ దేవదాయ శాఖ మంత్రికి, ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. దానిపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయ పూర్వ కమిటీ దీనిని వ్యతిరేకిస్తూ, అప్పగింతకు ఎటువంటి చర్యలు చేపట్టవద్దంటూ దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. ఈ ఆలయంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నామని, శారదా పీఠం స్మార్త ఆగమ శాస్త్రాన్ని అనుసరిస్తున్నదని, ఈ రెండూ వేర్వేరు కాబట్టి పూజాదికాల్లో తేడాలు వస్తాయని పేర్కొంది. అదే విధంగా పీఠాలకు, మఠాలకు ఆలయ నిర్వహణ బాధ్యతలు ఇవ్వడం తగదని, ఎప్పటిలాగే దేవదాయ శాఖ పరిధిలోనే ఉంచాలని, లేదంటే ఆలయ కమిటీకే అప్పగించాలని డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీ వైసీపీ నేతలు కీలకంగా వ్యవహరిస్తుండడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు రంగంలోకి దిగి ఆలయం ముందు శనివారం ధర్నా చేశారు. ఆలయాన్ని శారదా పీఠానికి అప్పగిస్తే ఊరుకోబోమని, ఆలయాల్లో రాజకీయాలు తగవని హెచ్చరించారు. ఈ వివాదంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది వేచిచూడాలి. ఇకపోతే ఇటీవల పుట్టినరోజు వేడుకలు చేసుకున్న శారదా పీఠాధిపతి ఇకపై తాను విశాఖపట్నంలో ఉండనని, హైదరాబాద్‌కు మకాం మారుస్తున్నానని ప్రకటించారు. ఆయనే ఇక్కడ ఉండనప్పుడు ఈ ఆలయం ఎవరికి అప్పగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దేవదాయ శాఖ పరిధిలోనే కొనసాగించాలని సూచిస్తున్నారు.

ఆది నుంచీ అవమానాలే

... 5వ పేజీ తరువాయి

ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 జరుగుతోంది. ఈ వేడుకల నిర్వహణకు సుమారు 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా, ఏయూకు అవకాశం దక్కింది. ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు వేర్వేరు రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నుంచి పరిశీలకులు హాజరయ్యారు. కీలకమైన ఈ వేడుకలకు సబంధించిన సమాచారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌ను తెలియజేయలేదు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్‌ను ఆమె పిలిపించి అడిగిన తరువాత గానీ షెడ్యూల్ ఇవ్వలేదు.

వాట్సాప్‌లో ఆహ్వానం..వీలుంటే రండి..

యూనిఫెస్ట్ వేడుకలను శుక్రవారం సాయంత్రం వర్సిటీలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానాన్ని ఇన్‌చార్జ్ వీసీకి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వాట్సాప్‌లో పంపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రిజిస్ట్రార్ మూడు గంటలకు వీసీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె...కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా అంటూ ప్రశ్నించారు. అలాగే వర్సిటీలో ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఎందుకు ఏర్పాటుచేయలేదని అడిగారు. అందుకు ఆయన...అన్నీ తాను చూసుకుంటానని, 'వీలుంటే రండి' అంటూ వెళ్లి పోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

సార్ రేపే వస్తున్నారంటూ ప్రచారం..

తన వద్దకు ఎవరూ రాకుండా, కనీసం గౌరవం ఇవ్వకపోవడం వెనుక వర్సిటీలోని కొంతమంది అధికారుల పాత్ర ఉందని ఇన్‌చార్జి వీసీ కె.సమత అభిప్రాయపడుతున్నారు. 'సార్ రేపే వస్తున్నారు...బాధ్యతలు తీసుకుంటున్నారు' అంటూ కొందరు ప్రచారం చేస్తుండడంతో అధికారులు, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ చాలామంది ఇన్‌చార్జ్ వీసీ ఛాంబర్ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు కూడా చాలామంది అధికారులు ఇన్‌చార్జి వీసీ ఛాంబర్‌కు వెళ్లలేదు. కనీసం మహిళా అధికారులు కూడా వెళ్లకపోవడంతో ఇన్‌చార్జ్ వీసీ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. తనను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించిందని, తానేమీ కావాలని కూర్చోలేదంటూ పలువురి వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. వ్యక్తిగతంగా తనకు గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ, వీసీ సీటుకు కూడా గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు బాధిస్తోందని వాపోయినట్టు తెలిసింది.

వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

కూడా పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. భీమిలి నుంచి పోటీకి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఇంకా గ్రీన్‌సిగ్నల్ రాలేదని చెబుతున్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం గాలింపు

విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా ప్రకటించారు. దీంతో వచ్చే ఎన్నికల్లో తూర్పు నుంచి ఎంవీవీ పోటీకి దిగడం ఖాయమని తేలిపోయింది. ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎంవీవీ స్థానంలో ఎంపీగా కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీలో ప్రస్తుతం ఉన్న నేతలు ఎవరూ ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌లను ఎంపీగా పోటీ చేయడంపై పార్టీ నేతలు అభిప్రాయం కోరగా, ఇద్దరూ ససేమిరా అన్నట్టు తెలిసింది. దీంతో ఎవరిని ఎంపీగా పోటీకి దింపుతారనే దానిపై పార్టీలో అనిశ్చితి నెలకొంది. అధికారంలో ఉన్న పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసేందుకు ఆశావహులు పోటీ పడాల్సింది పోయి...అభ్యర్థి కోసం అధిష్ఠానం గాలిస్తున్నట్టు తెలిసి నేతలు నిట్టూరుస్తున్నారు.

గడిచిన నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుండడం, మరోవైపు టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడంతో గెలుపుపై అనుమానం రావడంతోనే తమ నుంచి వలసలు పెరిగిపోయాయని అధికార పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. కొన్నాళ్ల కిందట పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు, దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు జనసేనలో చేరిపోయారు. వారం కిందట ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేనలో చేరారు. ఆ తరువాత రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. సుధాకర్ అనుచరులుగా గుర్తింపు పొందిన మరో ఐదుగురు కార్పొరేటర్లు కూడా త్వరలో వైసీపీని వీడతారనే ప్రచారం జరుగుతోంది. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరుగుతాయనగా పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు నేతలతో పాటు, కార్యకర్తలను కలవరపెడుతున్నాయి.


కేజీబీవీ టీచర్ల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

చెప్పుకుంటున్న ఒకరు కారణమని జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. సదరు నేత ఇచ్చిన సమాచారంతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్న ప్రచారం సాగుతుంది. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విశాఖలోని ఒక హోటల్‌లో వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా సమావేశం ఏర్పాటుచేసి నేతే...ఇప్పుడు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తున్నట్టు అనకాపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగులు అనుమానిస్తున్నారు.

సందడిగా తల్లికి వందనం

మహారాణిపేట, జనవరి 6: తల్లిదండ్రుల పట్ల భక్తి భావం ఉండాలని, చిన్నారులకు తల్లి విలువను తెలియజేయడంలో భాగంగానే తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కాశ్యప్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులతో శనివారం తల్లికి వందనం నిర్వహించారు. విద్యార్థులంతా తల్లుల కాళ్లు కడిగి, పూజలు చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.


తల్లులను పూజిస్తున్న చిన్నారులు



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న అతుల్‌భట్, తదితరులు

ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిష్యత్తు

స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 6: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యాభ్యాసం చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ సూచించారు. డీపీఎస్ స్కూల్ వార్షిక మ్యాగజైన్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అందరూ ఇష్టంతో చదువుకోవాలని, అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వామ్యులవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, జనవరి 6: గ్రేటర్ 96వ వార్డు పరిధి ప్రశాంతినగర్‌తో పాటు సమీప కాలనీల్లో రూ.రెండు కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, వైసీపీ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్లె రామునాయుడు, కె.అప్పారావు, ఎన్.బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు పరిశీలన

అగనంపూడి, జనవరి 6: జీవీఎంసీ 79వ వార్డు పరిధిలో రూ.1.91 కోట్ల వ్యయంతో చేపట్టిన శ్మశానవాటిక అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టరుకు సూచించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

సేవల్లో యువత ముందుండాలి

పెదగంట్యాడ, జనవరి 6: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో యువత ముందుండాలని కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి పేర్కొన్నారు. వెలమ యువజన సంక్షేమసంఘం శనివారం దయాళ్‌నగర్‌లో నిర్వహించిన యువజన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. యువతకు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. పారిశ్రామిక ప్రాంత వెలమ సంక్షేమ సంఘం నాయకులు ఎన్‌వై నాయుడు, కృష్ణ, రవి, ఆదిరెడ్డి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

59 బాటిళ్లు స్వాధీనం

కూర్మన్నపాలెం, జనవరి 6: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని సీజ్ చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 88వ వార్డు మంగళపాలెం సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో బడ్డీ కొట్టు నడుపుతున్న చీకటి బాలత్రిపురసుందరి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 59 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బడ్డీ కొట్టును సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 6: నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖా మంత్రి పురుషోత్తమ్ రూపాలకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అహ్మదాబాద్ నుంచి మధ్యాహ్నం 12.20 గంటలకు విమానంలో నగరానికి చేరుకున్న ఆయనకు నాయకులు బాలరాజేశ్వరరావు, కాశీవిశ్వనాథరాజు, ఎం.రవీంద్ర, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

కుట్టు మిషన్లు, నిత్యావసరాలు పంపిణీ

ఆటోనగర్, జనవరి 6: పేదలు, నిరాశ్రయులకు 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో శనివారం కుట్టు మిషన్లు, నిత్యావసర సరకులను సీఎల్‌సీ సంస్థ చైర్మన్ బిషప్ మహంతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మెర్సీ మహంతి, ఆల్‌ఫ్రెడ్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 56, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44,దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 20, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24, కంద 54, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	70
ఫారం ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వేడెక్కుతున్న అంగన్‌వాడీల సమ్మె

నిరవధిక నిరాహార దీక్షలకు శ్రీకారం

ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు ఆందోళనను విరమించబోమని స్పష్టీకరణ



పెందుర్తిలోని దీక్షా శిబిరంలో శనివారం రాత్రి నిద్రిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

పెందుర్తి, జనవరి 6: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె రోజురోజుకు తీవ్రతరంగా మారుతోంది. గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో వారు తమ నిరసనను తెలియజేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అంగన్‌వాడీలు శనివారం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షా శిబిరం సమీపంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరవధిక నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో దీక్షా శిబిరానికి తరలివచ్చారు. తొలిరోజు తొమ్మిది మంది అంగన్‌వాడీలు నిరాహార దీక్షలో కూర్చున్నారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీల గొంతు నొక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం అంగన్‌వాడీలు సమ్మె చట్ట విరుద్ధమని ఎస్మా కింద శనివారం ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ వైసీపీ ప్రభుత్వం జీవో ప్రతులతో హక్కులను కాలరాసిందంటూ నోటీసు ప్రతులను కాళ్ల కింద తొక్కిపెట్టి చూపిస్తూ.. ఇదేవిధంగా ప్రభుత్వాన్ని కాలకింద తొక్కేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, అధ్యక్షురాలు బృంద, తదితరులు పాల్గొన్నారు

దీక్షా శిబిరం వద్దే నిద్ర..

ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు దిగిన అంగన్‌వాడీలు శనివారం రాత్రి దీక్షా శిబిరం వద్దే నిద్రించారు. జగన్ ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు తాము దీక్షలను విరమించేదే లేదని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి న్యాయసమ్మతమైన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఎక్స్‌కవేటర్ సాయంతో చెత్తాచెదారాన్ని లారీలో వేస్తున్న దృశ్యం



ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పారిశుధ్య సమస్యపై అధికారుల దృష్టి

జీవీఎంసీ గాజువాక జోన్ పరిసరాల్లో వ్యర్థాల తరలింపునకు చర్యలు

పలుచోట్ల ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న సిబ్బంది

గాజువాక, జనవరి 6: పారిశుధ్య సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జీవీఎంసీ శాశ్వత పారిశుధ్య సిబ్బందితో పాటు వివిధ సంస్థలకు చెందిన సిబ్బంది, కొంతమంది ప్రైవేటు కార్మికులు కలిసి సుమారు 500 మంది గాజువాక ప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ప్రధాన రహదారులు, జంక్షన్లు, కీలక ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితిని చక్కదిద్దారు.

అయితే పలువు వార్డుల్లోని వీధులు, కాలనీల్లో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంతో రెండు రోజులుగా ఆయా ప్రాంతాల్లోని చెత్తను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. మరో నాలుగైదు రోజుల్లో వార్డుల్లో తిష్ఠ వేసిన చెత్తాచెదారాన్ని తొలగిస్తామని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. ఇప్పటికే కొన్ని వార్డుల్లో పారిశుధ్య పరిస్థితిని చక్కదిద్దిమన్నారు. క్రమంగా అన్ని వార్డుల్లోనూ చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెత్తకుప్పలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను వినియోగించడం వల్ల పనులు సులభతరంగా సాగుతున్నాయన్నారు. ఏఏ వార్డుల్లో పారిశుధ్య సమస్య అధికంగా ఉందో పర్యవేక్షించి ఆయా ప్రాంతాలకు ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ వెళ్లి శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బందితో పేరుకు పోయిన చెత్తను లారీల్లో తరలిస్తున్నారు. కొన్ని వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. కాగా కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరేంతవరకూ పారిశుధ్య పరిస్థితి మెరుగుపడడం కష్టతరమని ప్రజలు భావిస్తున్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



86వ వార్డులోని పంప్ హౌస్ వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న సిద్ధార్థనగర్ కాలనీవాసులు

కూర్మన్నపాలెం, జనవరి 6: తమ డిమాండ్ల సాధన కోసం జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది గత కొన్ని రోజులుగా నిరవధిక నిరసన దీక్షలు చేపట్టడంతో తాగునీరు అందక పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు 86వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన మహిళలతో పాటు పలువురు శనివారం ఖాళీ బిందెలతో పంప్ హౌస్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ పెద్ద ఎస్ఎస్ విజయరామరాజు మాట్లాడుతూ సిద్ధార్థనగర్‌లో వున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల వల్ల ఎప్పటికప్పుడు పంప్‌లు మొరాయిస్తున్నాయని, సక్రమంగా నీరందక ప్రజలు నానాపాట్లు పడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాగా తాగునీటి సరఫరా విభాగ కార్మికులు సమ్మెబాట పట్టడంతో మంచినీరు కోసం ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. వార్డు పరిధిలోని సుమారు 30 కాలనీల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అధికారులు తాగునీరు అందేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో ప్రజలకు అన్యాయం: ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

ఎన్.ఎ.డీ.జంక్షన్, జనవరి 6: వైసీపీ ప్రభుత్వ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి చరమగీతం పాడాలని ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. 52వ వార్డు పరిధి అంబేడ్కర్‌నగర్, శాంతినగర్‌లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం టీడీపీ నాయకుడు వై.తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేకర్, పి.మంజు, బలభద్రరాజు, కృష్ణవేణి, భాస్కర్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో ఎంతమంది వైసీపీ ఎమ్మెల్యేలను మార్చినా రానున్న ఎన్నికల్లో ఎగిరేది గెలిచేది తెలుగుదేశం పార్టీ జెండాయేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి రాజులపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, శ్రీనివాసవర్మ, సత్తిబాబు, వి.రాంబాబు, డీవీ అప్పారావు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

86 వార్డులో..

టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మాతృశ్రీనగర్, వుడానగర్‌లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేసినందుకు ప్రజలు ఇప్పుడు చెంపలేసుకుంటున్నారన్నారు. రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, మురళీమోహన్, జగదీశ్, రామారావు,రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ దివ్య క్షేత్రంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



అక్కిరెడ్డిపాలెం, జనవరి 6: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామిని వేకువజామున పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పువ్వులు, ఆభరణాలతో అలంకరించారు. శ్రీవారికి తోమాలసేవ చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి పుష్పాలతో సహస్ర నామార్చన, దీపార్చన శాంతికల్యాణం జరిపారు. పూజాది కార్యక్రమాల్లో పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన గ్రీన్ సిటీ ఆలయం

కూర్మన్నపాలెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారిని చందనంతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

108 స్వర్ణ పుష్పాలతో శ్రీవారికి అర్చన

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకటేశ్వరాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పూజలు జరిపారు. శ్రీవారికి 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక అర్చన చేశారు. అలాగే భరత్‌నగర్ సమీపం లక్ష్మీనరసింహనగర్‌లోని గోపిజనవల్లభస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

రాములోరి అక్షితలు పంపిణీ

గాజువాక, జనవరి 6: అయోధ్య రాముని అక్షితలు, చిత్రపటాలను శనివారం గాజువాకలోని పలు ప్రాంతాల్లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వీటిని పంపిణీ చేస్తామన్నారు. ప్రపంచం గర్వించదగిన అయోధ్య మందిర ప్రారంభోత్సవం ఓ పండగలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా అప్పారావు, సుబ్బరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తా: 'ఆడారి'



ఆళ్ల పైడిరాజును సత్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, జనవరి 6: కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అభివృద్ధికి కృషి చేస్తానని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. కొత్తపాలెంలోని పీఏసీఎస్‌కు నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఆళ్ల పైడిరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని కొత్తపాలెం పీఏసీఎస్‌కు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆళ్ల పైడిరాజు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధితో పాటు రైతులు, ఖాతాదారుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. అనంతరం పైడిరాజును ఆనంద్‌కుమార్ ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి గోపి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

వేపగుంట, జనవరి 6: స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విశాఖ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనపివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, నరసింహమూర్తి, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో భోజనశాల ప్రారంభం

గోపాలపట్నం, జనవరి 6: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థి పాలకుర్తి నరేశ్ ఆర్థిక సాయంతో పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన భోజనశాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేణుగోపాల్ మాట్లాడుతూ యూఎస్‌లో ఉద్యోగం చేస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థి నరేశ్ రూ.6.50 లక్షలతో పాఠశాలలో భోజనశాల నిర్మించడం అభినందనీయమన్నారు. విరాళ దాత నరేశ్ తల్లి పుష్పలత చేతులమీదుగా భోజన శాలను ప్రారంభింపజేశారు.

నేడు వెంకటాద్రి శిఖరంపై సుదర్శన హోమం

పెందుర్తి, జనవరి 6: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ వర్గాలు, శ్రీవారి సేవాదళ్ బృందం వెంకటాద్రి శిఖరం మార్గంలో వున్న సుదర్శన కల్యాణ మండపం స్థలం వద్ద హోమం ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించారు. ప్రత్యేక యాగశాలలో హోమగుండాలను ఏర్పాటు చేశారు. హోమంలో భాగంగా పదివేల మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సుమారు పదిహేను వేల మందికి అన్నప్రసాదాన్ని అందించనున్నారు. సుదర్శన హోమంలో పాల్గొనేందుకు రానున్న భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాగా శనివారం భక్తులు తిరుప్పావై పఠనం చేసి గోదాదేవి 21వ పాశురాన్ని స్వామివారికి నివేదించారు. శ్రీవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'ట్రేడ్ యూనియన్ల దందాలను బయటపెడతా'

మల్కాపురం, జనవరి 6: హెచ్‌పీసీఎల్‌లో ట్రేడ్ యూనియన్ల పేరుతో పలువురు నాయకులు దందాలు సాగిస్తున్నారని, వీటిని త్వరలోనే బయటపెడతానని వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి శరగడం పత్నీరావు అన్నారు. శనివారం హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ సంస్థ అధికారులను ఆ యన కలిసి పలు సమస్యలను వివరించడంతో పాటు న్యాయబద్ధంగా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. పలువురు అధికారులతో వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు చేతులు కలిపి కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌అండ్‌టీ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కార్మికులను అన్యాయంగా తొలగించారని, తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఆ కార్మికులిద్దరిని విధుల్లోకి తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

ఐఎన్‌సీఈ ప్రధాన కార్యదర్శిగా చిన్నారావు

సింధియా, జనవరి 6: ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో ఐఎన్‌సీఈ ప్రధాన కార్యదర్శిగా బోరా చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఈ బాధ్యతలను అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యూనియన్ మిత్రపక్షాలు ఎస్సీ, ఎస్టీ అప్‌లిఫ్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు భూసా ప్రకాశం, నాయకులు శంకరరావు,రమణ, నాయుడు, అప్పలరాజు, తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

శివారు ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించాలి

పెందుర్తి, జనవరి 6: శివారు ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించాలని డీఆర్‌సీ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి రమణచిట్టి కోరారు. ఇక్కడి రాజులచెరువు సామాజిక భవనంలో శనివారం డీఆర్‌సీ ట్రస్టు సహకారంతో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ శిబిరంలో సుమారు వందమందికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 6: స్టీల్‌ప్లాంట్ సృష్టి స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ చూపరులను అమితంగా ఆకట్టుకున్నది. వినూత్న ఆలోచలతో విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమం అందరి మన్ననలను అందుకున్నది. విమ్సీ వండర్‌ల్యాండ్, టెక్ ఒడెస్సీ, ఫ్లేటోపియా, ఫుడ్‌థాన్, ఎంట్రప్రెన్యూరియల్ ఫోకస్, చంద్రయాన్, స్టీమ్ పవర్‌ప్లాంట్, తదితర నమూనా ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. తొలుత ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఈడీ మేఘన, డైరెక్టర్ సుశీలరాణి, ప్రిన్సిపాళ్లు చంద్రిక, శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాదయాత్ర

గాజువాక, జనవరి 6: వైసీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు) శనివారం నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అర్హులందరూ ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు గుడివాడ లతీశ్, మహాలక్ష్మీనాయుడు, డి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు అన్నారు. స్థానిక పంచవటిలోని వినాయక మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు చేశాక వార్డు పర్యటనలను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, నూకరాజు, విశ్వేశ్వరరావు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అగనంపూడి, జనవరి 6: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంస్థ కన్వీనర్ కొండపల్లి రామారావు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నకుమార్, స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, హనుమంతరావు, మామిడి శ్రీను, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

గాజువాక, జనవరి 6: కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. గాజువాక జోనల్ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, నాగరాజు, కిరీటం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రేయ ఫౌండేషన్ వార్షికోత్సవం

పెందుర్తి-రూరల్, జనవరి 6: చినముషిడివాడ లక్కీ ఫంక్షన్ హాల్‌లో శనివారం శ్రేయ ఫౌండేషన్ 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ముమ్మన దేముడు విశేష సేవలందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఉమాదేవి, సుజాత, భాగ్యలక్ష్మి, సంతోషి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ, జనవరి 6: సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా అదానీ గంగవరం పోర్టు కల్పించే సౌకర్యాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని గాజువాక గామ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. గంగవరం పోర్టు యాజమాన్యం దిబ్బపాలెంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ గ్రౌండ్, గంగవరంలో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత యువకులు విద్యారంగం, క్రీడల్లో పోర్టు యాజమాన్య సహకారాన్ని తీసుకోవాలని కోరారు. పోర్టు సీఈవో బీజీ గాంధీ, అదానీ ఫౌండేషన్ ప్రతినిధి అనిల్ బాలకృష్ణలు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం చేపట్టిన మౌలిక వసతుల కల్పన, వెల్ఫేర్, విద్యాపరమైన కార్యక్రమాలు ప్రగతిశీలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎన్నికల అధికారి, పరిశీలకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 6: తైక్వాండో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పి.అచ్యుతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని లయన్స్ క్లబ్‌లో శనివారం జరిగిన ఎన్నికలలో కోశాధికారిగా బి.అర్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎం.అచ్చెన్నాయుడు, నాయబ్ రసూల్, సంయుక్త కార్యదర్శులుగా దొరబాబు, కొమర భాస్కరరావు, కె.జగన్మోహనరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాసరావు, ఎం.సాయిబాబా, అంకంరావు, లింగేశ్వర్, జ్యోతి ఎన్నికయ్యారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (సీఐడీ) నమ్మి శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఒలింపిక్ సంఘం ప్రతినిధి ఎంపీ.మాణిక్యాలు, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కె.శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారని రాష్ట్ర సంఘం కార్యదర్శి వేణుగోపాలరావు తెలిపారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ ఆంజనేయరెడ్డి

సీతమ్మధార, జనవరి 6: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 46వ వార్షిక సమావేశం, కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత డీజీపీ సి.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ తెలుగు వారి చరిత్ర లిఖించడంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన మల్లంపల్లి సోమశేఖరశర్మ, బీఎస్ఎల్ హనుమంతరావు విశిష్ట సేవలు అందించారన్నారు. కాకతీయ రాజుల అనంతరం ఉభయ రాష్ట్రాల సమగ్ర చరిత్రను అందించారన్నారు. చాలా మంది భావిస్తున్నట్టుగా వేదాలు మన సంస్కృతి పునాదులు కాదని, బుద్ధిజం, జైనిజం తెలుగువారి సంస్కృతి పునాదులని ఈ మేధావులు తెలిపారన్నారు. బ్రిటీష్ వారు దేశానికి వచ్చిన నాటికి మన గతమంతా ఊహాజనితత్వంతోనే మరుగున పడిపోయిందన్నారు. వాగాడంబరతతో గ్రామాల కోసం లిఖించిన కైఫీయతులు, దైవక్షేత్రాల స్థల పురాణాలు మాత్రమే ఉండేవని వివరించారు. ఊహాజనిత రచనల నుంచి వాస్తవాలను వేరుచేసి వాస్తవాలతో బేరీజు వేసుకొని విన్సెంట్స్ స్మిత్, కల్నల్ టాడ్, రాబర్ట్ సూయల్ వంటి చరిత్రకారులు దేశ చరిత్ర రచించారని, అయితే వారు మన ప్రాంతీయ చరిత్రలను విస్మరించారని వ్యాఖ్యానించారు. మరో అతిథి ప్రొఫెసర్ వకుల భరణం రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్థకు పరిచయం చేశారు. కళల ప్రాముఖ్యత కాలక్రమేణా తగ్గిపోతోందని, ఆర్ట్స్ సబ్జెక్టులను అర్థం చేసుకోవడం ముఖ్యమన్నారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ కె.సమత బుల్లయ్య కళాశాల సావనీర్‌ను విడుదల చేశారు. నగర చరిత్ర, సంస్కృతి మూలాన్ని వివరించారు. సమావేశంలో కళాశాల అధ్యక్షుడు కేజీ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీహెచ్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జె.లక్ష్మణబాబు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ హెడ్ పీఎం శరత్‌కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీని మరోసారి ఆదరించండి

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- ఉత్తర నియోజకవర్గంలో సామాజిక సాధికార యాత్ర



సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

అక్కయ్యపాలెం, జనవరి 6: రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ఆధ్వర్యంలో కైలాసపురం పోర్టు ఆస్పత్రి ఎదుట రహదారిపై శనివారం సామాజిక సాధికార యాత్రలో భాగంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. మేయర్ హరి కుమారి మాట్లాడుతూ వైఎస్ మహిళలకు రాజకీయం ప్రాధాన్యమిచ్చారని, అతని బాటలోనే జగన్ నడుస్తున్నారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ప్రజల సమస్యలను తెలుసుకోవడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, తదితరులు ప్రసంగించారు. అంతకుముందు మాధవధార వుడా కాలనీ గ్రాండ్ మిలన్ ఫంక్షన్ హాల్ నుంచి బైక్ ర్యాలీ, బస్సు యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.



సభ ప్రారంభం కాకముందే ఇళ్లకు వెళ్లిపోతున్న మహిళలు

ప్రారంభానికి ముందే వెనుతిరిగిన మహిళలు

అక్కయ్యపాలెం: పోర్టు ఆస్పత్రి ఎదుట రహదారిపై శనివారం నిర్వహించిన వైసీపీ బహిరంగ సభ ప్రారంభం కాకముందే మహిళలు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా నాయకులు ఆలస్యంగా రావడంతో కొద్ది మంది వెళ్లిపోయారు. ఓ వైపు సభ జరుగుతుండగా మహిళలు బారికేడ్లు దాటేందుకు యత్నించగా నాయకులు నిలువరించారు. పిల్లలను ఇంటివద్ద వదిలి వచ్చామంటూ ఆగ్రహం వ్యక్తం చేసినా బారికేడ్లు తీయకుండా నిరోధించారు. కాగా సభకు వచ్చిన వారికి బిస్కెట్ ప్యాకెట్, డ్రింక్ బాటిల్స్‌ను గాలిలోకి విసిరివేయడంపై పలువురు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ



కార్డులు అందిస్తున్న యాసిన్

మర్రిపాలెం, జనవరి 6: స్థానిక రైతుబజార్‌లో అర్హులైన రైతులకు శనివారం మార్కెటింగ్ అధికారి షేక్‌యాసిన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. జేసీ ఆదేశాల మేరకు రైతుల భూములు, పంటలను రెవెన్యూ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులతో పరిశీలన చేయించి, అర్హులను గుర్తించి కార్డులను అందజేశామన్నారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పూర్ణామార్కెట్, జనవరి 6: గ్రేటర్ 39వ వార్డు కన్వేయర్ బెల్ట్ వద్ద వేదాంత గూడ్స్ కార్గో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కనకమహాలక్ష్మి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికుల ఆరోగ్య ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేసి, నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించడం శుభ పరిణామమన్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి మందులను అందజేశారు. శిబిరంలో వేదాంత కార్గో గూడ్స్ మేనేజర్ జేఎస్ లక్ష్మి, ఎఫ్ఎక్స్‌బీ సురక్షా మేనేజర్ వై.అశోక్, గాయత్రి మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో ఏఎంసీ ప్రిన్సిపాల్, తదితరులు

మహారాణిపేట, జనవరి 6: సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర మెడికల్ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్ షిప్‌లు ఇచ్చేందుకు ఛేజ్ ఇండియా సంస్థ సీఎస్ఆర్ నిధులను అందజేసింది. ఇంజనీరింగ్, మెడిసిన్, డిప్లొమో, నర్సింగ్, తదితర విభాగాల్లో చదువుతున్న సుమారు 192 మంది విద్యార్థులకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు స్కాలర్‌షిప్‌లను అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు విద్య ఒక్కటే మార్గమని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి స్కాలర్‌షిప్‌లను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఛేజ్ ఇండియా సీఈవో శ్యామ్, సృజనవాణి వైస్ ప్రెసిడెంట్ జి.ఉమాశంకర్, డాక్టర్ జయసుమ, డాక్టర్ కేవీ రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మి రథోత్సవం



రథోత్సవంలో ఎమ్మెల్యే వాసుపల్లి, ఈవో శిరీష, తదితరులు

జగదాంబ కూడలి, జనవరి 6: మార్గశిర మాసోత్సవాల సందర్భంగా వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దత్తత దేవాలయం శ్రీరామచంద్రస్వామి ఆలయం వద్ద దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో కనకమహాలక్ష్మి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. ఈవో కె.శిరీష, ఏఈవో తిరుమలేశ్వరరావు, చైర్మన్ సింహాచలం, సభ్యులు ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళలు కలశాలతో రథం వెంట నడిచారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్వర్ణోత్సవం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

సీతమ్మధార, జనవరి 6: స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాల 50 వసంతాల ఉత్సవాలను శనివారం నిర్వహించారు. సావనీర్‌ను ప్రిన్సిపాల్ ఫాదర్ పి.మనోజ్ అధ్యక్షతన అతిథులు మెటా వైస్ ప్రెసిడెంట్ సంధ్య దేవనాదన్, ఖమ్మం అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, గొండు సీతారాం ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు భాగస్వాములయ్యారు.

ద్వారకా సీఐగా రమేష్ బాధ్యతలు

సీతంపేట: ద్వారకా సీఐగా ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా ఖాళీగా ఉన్న స్థానంలో సీసీఎస్ 1 సీఐ ఎస్.రమేష్‌ను సీపీ నియమించారు. ఇతను గతంలో పెందుర్తి క్రైమ్ సీఐగా, పీఎం పాలెం ట్రాఫిక్ విభాగం, ఏసీబీలో పనిచేశారు.

'విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం'



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న మేయర్

అక్కయ్యపాలెం, జనవరి 6: విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైసీపీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు మేయర్ హరి కుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముక్కా శ్రావణి, బానాల శ్రీనివాసరావు, శశికళ, పద్మారెడ్డి, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డీఈవో చంద్రకళ, జీవీఎంసీ డీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసమే బస్సు యాత్ర

సీతమ్మధార: వైసీపీ సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయంపై ప్రజలకు వివరించేందుకు సామాజిక బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఉత్తర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు, సంక్షేమ పథకాల అమలు తెలియజేస్తున్నామన్నారు. మూడో విడత యాత్ర ఉత్తర నియోజకవర్గంలో ప్రారంభమయిందని, మూడు జిల్లాల పరిధిలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

డాబాగార్డెన్స్, జనవరి 6: సీనియర్ సిటిజన్స్ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం అందరికీ పెన్షన్ అందాలి...అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.200 పెన్షన్ ఇస్తుందని, 2.2 కోట్ల మందికి మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీనిని రూ.3 వేలకు పెంచాలన్నారు. ఏ స్కీమ్‌లోనూ లేనివారికి సార్వత్రిక పెన్షన్ రూ.8 వేలు ఇవ్వాలన్నారు. జాతీయ ఉత్పాదకతలో భాగస్వాములు కాబట్టి వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. అందరికీ పెన్షన్ సమస్యపై తీర్మానం చేశారు. సదస్సులో ఐసీఆర్ఈఏ ప్రెసిడెంట్ కె.మోహనరావు, ఫోరం ఫర్ డెవలప్‌మెంట్ నార్త్ఆంధ్ర ఎ.అజశర్మ, ఆర్.వెంకటరావు, బీటీ మూర్తి, వి.నరసింగరావు, ఎం.కామేశ్వరి, పీవీ సుబ్బారావు, సోల్మన్‌రాజు, ఎంఆర్‌డీ రాజు, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

శారదా పీఠానికి వైభవ వెంకటేశ్వరుని ఆలయం!?

... 5వ పేజీ తరువాయి

వ్యతిరేకించింది. మరో వర్గం అంగీకరించింది. వెంటనే ఆ కమిటీతో శారదా పీఠానికి లేఖ రాయించారు. ఆలయాన్ని తాము సరిగ్గా నిర్వహించలేకపోతున్నామని, స్వాధీనం చేసుకుని పూజాదికాలు చేయించాలన్నది దాని సారాంశం. అయితే పీఠం వెంటనే అంగీకారం తెలపకుండా పీఠాధిపతులు ఇద్దరూ రుషీకేశ్ పర్యటనలో ఉన్నారని, వచ్చాక నిర్ణయం ప్రకటిస్తామని సమాధానం ఇచ్చింది. ఈ విషయం తెలిసి మరో వర్గం ఆలయాన్ని ఇవ్వడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇలా అయితే లాభం లేదని ఒక రోజు ఆకస్మికంగా నాటి ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి, స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త కలిసి ఆలయాన్ని దేవదాయ శాఖకు అప్పగిస్తున్నామని ప్రకటించారు. ఆ వెంటనే అప్పటి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి వెళ్లి ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. 2020 సెప్టెంబరు 30న ఆలయానికి దేవదాయ శాఖ తరఫున ఈఓను నియమించారు. ఇకపై ఈఓ ఆధ్వర్యంలోనే అన్నీ జరుగుతాయని ప్రకటించి, స్థిరచరాస్తులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆలయం దేవదాయ శాఖ పర్యవేక్షణలోనే ఉంది. ఈఓ బండారు ప్రసాద్ అన్ని వ్యవహారాలు చూస్తున్నారు.

హంసలదీవిలా ఇవ్వాలని తాజాగా లేఖ

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జిల్లా హంసలదీవిలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలను శృంగేరి జగద్గురు మహా సంస్థానానికి అప్పగించింది. ఆ జీఓను అనుసరించి కప్పరాడలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శారదా పీఠానికి అప్పగించాలని ప్రస్తుత ఆలయ కమిటీ దేవదాయ శాఖ మంత్రికి, ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. దానిపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయ పూర్వ కమిటీ దీనిని వ్యతిరేకిస్తూ, అప్పగింతకు ఎటువంటి చర్యలు చేపట్టవద్దంటూ దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. ఈ ఆలయంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నామని, శారదా పీఠం స్మార్త ఆగమ శాస్త్రాన్ని అనుసరిస్తున్నదని, ఈ రెండూ వేర్వేరు కాబట్టి పూజాదికాల్లో తేడాలు వస్తాయని పేర్కొంది. అదే విధంగా పీఠాలకు, మఠాలకు ఆలయ నిర్వహణ బాధ్యతలు ఇవ్వడం తగదని, ఎప్పటిలాగే దేవదాయ శాఖ పరిధిలోనే ఉంచాలని, లేదంటే ఆలయ కమిటీకే అప్పగించాలని డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీ వైసీపీ నేతలు కీలకంగా వ్యవహరిస్తుండడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు రంగంలోకి దిగి ఆలయం ముందు శనివారం ధర్నా చేశారు. ఆలయాన్ని శారదా పీఠానికి అప్పగిస్తే ఊరుకోబోమని, ఆలయాల్లో రాజకీయాలు తగవని హెచ్చరించారు. ఈ వివాదంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది వేచిచూడాలి. ఇక పోతే ఇటీవల పుట్టినరోజు వేడుకలు చేసుకున్న శారదా పీఠాధిపతి ఇకపై తాను విశాఖపట్నంలో ఉండనని, హైదరాబాద్‌కు మకాం మారుస్తున్నానని ప్రకటించారు. ఆయనే ఇక్కడ ఉండనప్పుడు ఈ ఆలయం ఎవరికి అప్పగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దేవదాయ శాఖ పరిధిలోనే కొనసాగించాలని సూచిస్తున్నారు.

ఆది నుంచీ అవమానాలే

... 5వ పేజీ తరువాయి

ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 జరుగుతోంది. ఈ వేడుకల నిర్వహణకు సుమారు 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా, ఏయూకు అవకాశం దక్కింది. ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు వేర్వేరు రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నుంచి పరిశీలకులు హాజరయ్యారు. కీలకమైన ఈ వేడుకలకు సబంధించిన సమాచారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌ను తెలియజేయలేదు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్‌ను ఆమె పిలిపించి అడిగిన తరువాత గానీ షెడ్యూల్ ఇవ్వలేదు.

వాట్సాప్‌లో ఆహ్వానం..వీలుంటే రండి..

యూనిఫెస్ట్ వేడుకలను శుక్రవారం సాయంత్రం వర్సిటీలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానాన్ని ఇన్‌చార్జ్ వీసీకి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వాట్సాప్‌లో పంపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రిజిస్ట్రార్ మూడు గంటలకు వీసీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె...కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా అంటూ ప్రశ్నించారు. అలాగే వర్సిటీలో ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఎందుకు ఏర్పాటుచేయలేదని అడిగారు. అందుకు ఆయన...అన్నీ తాను చూసుకుంటానని, 'వీలుంటే రండి' అంటూ వెళ్లి పోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

సార్ రేపే వస్తున్నారంటూ ప్రచారం..

తన వద్దకు ఎవరూ రాకుండా, కనీసం గౌరవం ఇవ్వకపోవడం వెనుక వర్సిటీలోని కొంతమంది అధికారుల పాత్ర ఉందని ఇన్‌చార్జి వీసీ కె.సమత అభిప్రాయపడుతున్నారు. 'సార్ రేపే వస్తున్నారు...బాధ్యతలు తీసుకుంటున్నారు' అంటూ కొందరు ప్రచారం చేస్తుండడంతో అధికారులు, ప్రిన్సిపాల్స్ స్టాఫ్ చాలామంది ఇన్‌చార్జ్ వీసీ ఛాంబర్ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు కూడా చాలామంది అధికారులు ఇన్‌చార్జి వీసీ ఛాంబర్‌కు వెళ్లలేదు. కనీసం మహిళా అధికారులు కూడా వెళ్లకపోవడంతో ఇన్‌చార్జ్ వీసీ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. తనను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించిందని, తానేమీ కావాలని కూర్చోలేదంటూ పలువురి వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. వ్యక్తిగతంగా తనకు గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ, వీసీ సీటుకు కూడా గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు బాధిస్తోందని వాపోయినట్టు తెలిసింది.

వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

కూడా పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. భీమిలి నుంచి పోటీకి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఇంకా గ్రీన్‌సిగ్నల్ రాలేదని చెబుతున్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం గాలింపు

విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా ప్రకటించారు. దీంతో వచ్చే ఎన్నికల్లో తూర్పు నుంచి ఎంవీవీ పోటీకి దిగడం ఖాయమని తేలిపోయింది. ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎంవీవీ స్థానంలో ఎంపీగా కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీలో ప్రస్తుతం ఉన్న నేతలు ఎవరూ ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌లను ఎంపీగా పోటీ చేయడంపై పార్టీ నేతలు అభిప్రాయం కోరగా, ఇద్దరూ ససేమిరా అన్నట్టు తెలిసింది. దీంతో ఎవరిని ఎంపీగా పోటీకి దింపుతారనే దానిపై పార్టీలో అనిశ్చితి నెలకొంది. అధికారంలో ఉన్న పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు ఆశావహులు పోటీ పడాల్సింది పోయి...అభ్యర్థి కోసం అధిష్ఠానం గాలిస్తున్నట్టు తెలిసి నేతలు నిట్టూరుస్తున్నారు.

గడిచిన నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుండడం, మరోవైపు టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడంతో గెలుపుపై అనుమానం రావడంతోనే తమ నుంచి వలసలు పెరిగిపోయాయని అధికార పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. కొన్నాళ్ల కిందట పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు, దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు జనసేనలో చేరిపోయారు. వారం కిందట ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేనలో చేరారు. ఆ తరువాత రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. సుధాకర్ అనుచరులుగా గుర్తింపు పొందిన మరో ఐదుగురు కార్పొరేటర్లు కూడా త్వరలో వైసీపీని వీడతారనే ప్రచారం జరుగుతోంది. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరుగుతాయనగా పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు నేతలతో పాటు, కార్యకర్తలను కలవరపెడుతున్నాయి.

కేజీబీవీ టీచర్ల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

చెప్పుకుంటున్న ఒకరు కారణమని జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. సదరు నేత ఇచ్చిన సమాచారంతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్న ప్రచారం సాగుతుంది. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విశాఖలోని ఒక హోటల్‌లో వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా సమావేశం ఏర్పాటుచేసి నేతే...ఇప్పుడు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తున్నట్టు అనకాపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగులు అనుమానిస్తున్నారు.

సందడిగా తల్లికి వందనం



తల్లులను పూజిస్తున్న చిన్నారులు

మహారాణిపేట, జనవరి 6: తల్లిదండ్రుల పట్ల భక్తి భావం ఉండాలని, చిన్నారులకు తల్లి విలువను తెలియజేయడంలో భాగంగానే తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కాశ్యప్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులతో శనివారం తల్లికి వందనం నిర్వహించారు. విద్యార్థులంతా తల్లుల కాళ్లు కడిగి, పూజలు చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

సంగివలసలో అక్రమ నిర్మాణాలు

తగరపువలస, జనవరి 6 : జీవీఎంసీ రెండవ వార్డు సంగివలస సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. పలువురు ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనివల్ల కూడలిలో వాహనాలు మలుపు తిరగడానికి ఇబ్బందులు ఏర్పడడంతో పాటు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే

తగరపువలస, జనవరి 6 : బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. అలాగే మట్టి, ఆకులు, కర్ర పుల్లలు, చీపురు పుల్లలు, చింత పిక్కలు, రంగు కాగితాలు, అట్ట ముక్కలతో వివిధ వస్తువులు తయారు చేయించారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

తగరపువలస, జనవరి 6 : చిట్టివలస బంతాట మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అధికారులు శనివారం క్రికెట్ కిట్లు, దుస్తులు పంపిణీ చేశారు. బొగ్గులదిబ్బ సచివాలయం పరిధిలోని చిల్లపేట, జీరుపేట, సుఖీభవ కాలనీ చిట్టివలస క్రీడాకారులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ కిషోర్, కార్యదర్శులు శివ, గురునాథ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు

రామాలయంలో సాయి భజనలు

వెంకోజీపాలెం, జనవరి 6 : పాత వెంకోజీపాలెంలోని సీతారామాలయంలోని ద్వారకమయి భక్త బృందం శనివారం 12 గంటల నిర్విరామ సాయి భజనలు చేశారు. సీతారామ సేవా సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా భజనలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో భక్త బృందాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రంపా రామ్మోహన్ శర్మ, సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేటి సూర్యనారాయణ, అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం, కాళ్ల అప్పలరాజు, వెలగా వెంకటరావు, ఎ.శివప్రకాష్, ఎస్. సుధాకర్ పాల్గొన్నారు.

నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

ఆనందపురం జనవరి 6 : మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన గుడిలోవ ఛానల్ నీటిసంఘం మాజీ అధ్యక్షుడు కూరాకుల సంజీవరావు (85) శనివారం ఉదయం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. 1995 నుంచి 2005 మధ్య కాలంలో ఆయన గుడిలోవ ఛానల్ నీటి సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. అతని మృతదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సన్ క్యాలెండర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, జనవరి 6 : స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ నూతన క్యాలెండర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఎస్‌వీ రాజారెడ్డి, సుధాకర్ పట్నాయక్, మహమ్మద్ ఇషాక్, కొయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ముద్రించిన నూతన క్యాలెండర్‌ను అనువంశిక ధర్మకర్త, దివంగత పూసపాటి ఆనంద గజపతిరాజు సతీమణి సుధా గజపతిరాజు, కుమార్తె ఊర్మిళా గజపతి శనివారం సింహగిరిపై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, డిప్యూటీ ఈఓ ఎస్. సుజాత, పర్యవేక్షణాధికారి సునీల్, సిసి వరహాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో అభివృద్ధి ఎక్కడ ?

కొమ్మాది, జనవరి 6 : జీవీఎంసీ పరిధిలోని ఆరో వార్డు పీఎం పాలెం కాలనీ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే వార్డులో ఎక్కడా జరగనంత అభివృద్ధి కాలనీలో జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పీఎంపాలెంలో జరిగిన పింఛన్ల పంపిణీ సభలో ఎమ్మెల్యే ఆయన కుమార్తె, వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక మాట్లాడుతూ ఆరో వార్డును మోడల్‌గా తీర్చిదిద్దామని చెప్పారని, అంత అభివృద్ధి జరిగితే శ్మశాన వాటికకు ఇంతవరకు ఎందుకు రోడ్డు వేయలేదని ప్రశ్నించారు. అలాగే ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, డ్రైనేజీలు బాగాలేవని, రహదారులు గోతులతో ఉన్నాయని విమర్శించారు.

సినిమా గైడ్

● **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)

● **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **పిండం :** మోహిని (గాజువాక)

● **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 56, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24 , కంద 54, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు		
బ్యాగ్		
రైతు ధర	--	70
ఫారం ధర	--	90
విత్ స్కిన్	--	150
స్కిన్‌లెస్	--	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

వెంటాడుతున్న వ్యాధుల భయం

» వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు » రోజుల తరబడి సమ్మెలో పారిశుధ్య కార్మికులు
» పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వం

భీమునిపట్నం, జనవరి 6 : పట్టణంలో పారిశుధ్యం రోజురోజుకి దారుణంగా తయారవుతోంది.వార్డుల్లో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీంతో ఈగలు, దోమల వ్యాప్తితో ఎక్కడ రోగాలు వస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నూకాలమ్మ గుడివీధి, సిబిఎం స్కూల్ రోడ్, నెహ్రూ స్కూల్ రోడ్, పాత బస్టాండ్‌లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడం... ప్రభుత్వం వారి డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


సిబిఎం స్కూల్ రోడ్‌లో చెత్త


నరసింహస్వామి ఆలయం వీధిలో దుస్థితి


పోలీసు స్టేషన్ జంక్షన్‌లో కార్మికుల ఆందోళన

పారిశుధ్య కార్మికుల నిరసన

భీమునిపట్నం, జనవరి 6 : పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే అధికారులు తూట్లు పొడిచేలా పట్టణం లోని చెత్త ఎప్పటికపుడు ఎత్తి వేస్తున్నారని సీఐటీ యూ భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మండిపడ్డారు. శనివారం చెత్తను ఎత్తి తీసుకువెళుతున్న వాహనాన్ని భీమిలి పోలీసుస్టేషన్ జంక్షన్‌లో కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సమ్మెకు అధికారులు మానవతా దృక్పథంతో సహకరించాల్సిందిపోయి ప్రభుత్వం వద్ద మార్కులు వేసుకోవడానికి సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ఏ రోజుకా రోజు చెత్తను అర్ధరాత్రి వేళ ఎత్తి వేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇదే పరిస్థితి ఉంటే ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్ల ముందు చెత్త తీసుకువెళ్లి డంప్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జలగడుగుల సురేష్, బొడ్డు రాజు, సన్ని, శ్రీను పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ సత్యనారాయణ

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

వెంకోజీపాలెం, జనవరి 6 : జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో రూ. 66 లక్షలతో నిర్మించనున్న రోడ్ల పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసీపీ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ ఎం. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర

ఆరిలోవ, జనవరి 6 : వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శనివారం 11వ వార్డులో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్, శ్రీరామ్‌నగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు వైసీపీ ఇన్‌చార్జి గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చొక్కర శేఖర్, భాషా పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

భీమునిపట్నం (రూరల్), జనవరి 6 : తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 800 మంది గ్రాడ్యుయేట్లకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి ఎం. ప్రియాంక, వైస్ చైర్మన్ శివ నందీస్, ఎండీ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సురక్ష బీమా నగదు అందజేత

భీమునిపట్నం (రూరల్), జనవరి 6 : చిప్పాడ గ్రామానికి చెందిన పెదాడి రేణుకకు కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం సురక్ష బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల పరిహారాన్ని అధికారులు శనివారం ఆమెకు అందజేశారు. ఆమె పథకంలో చేరి ఏడాదికి రూ. 20 చొప్పున కుటుంబానికి బీమా చెల్లించింది. ఈమేరకు గత నెల ఆమె భర్త ప్రమాదవశాత్తు మృతి చెందడంతో రూ. రెండు లక్షల పరిహారం మంజూరైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కె. రామానాయుడు, చిప్పాడ సర్పంచ్ వెంపాడ రమావతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విరాట్ -2024

మధురవాడ, జనవరి 6 : మధురవాడ సిమ్స్ కళాశాల ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న విరాట్ - 2024 ఈవెంట్ శనివారంతో ముగిసింది. సీఎంటీ, సిమ్స్ కళాశాలలు సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా సింబియోసిస్ సీఈఓ ఓ. నరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, విజయ రవీంద్ర, లారెన్స్, సాయిప్రశాంత్, అర్చన, ఉమా సుందరి, అలక చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వేలీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ఆరిలోవ, జనవరి 6 : విశాఖ వేలీ స్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భోగి, సంక్రాంతి, కనుమ పండగల విశిష్టను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆనందపురానికి చెందిన దొంత బాలరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

పద్మనాభం, జనవరి 6 : మండలంలోని మద్ది జెడ్పీ పాఠశాల, పద్మనాభంలోని కేజీబీవీలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ కె. రాంబాబు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మద్దిలో 41 మంది, కేజీబీవీలో 40 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువ విభాగం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, హెచ్ఎం ప్రసూన, కేజీబీవీ ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

'రా... కదలిరా'తో వైసీపీలో వణుకు

భీమునిపట్నం, జనవరి 6 : చంద్రబాబు రూపొందించిన రా.. కదలి రా కార్యక్రమంతో వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం రాత్రి 3వ వార్డు నేరేళ్లవలస కాలనీలో రా.. కదలి రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజలను ఆదుకుంటామన్నారు. రా.. కదలి రా కార్యక్రమానికి రాష్ట్రంలో విశేషమైన స్పందన లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్థానికులకు టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న నూకరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

12వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ఆరిలోవ, జనవరి 6 : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా... ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు.శనివారం 12వ వార్డు అంబేడ్కర్ నగర్ జంక్షన్, లీలా సుందరయ్య నగర్‌లో జరిగిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పల రాజు, బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, భరత్, జనసేన నాయకులు అప్పారావు, పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన రూసా పీడీ

వెంకోజీపాలెం, జనవరి 6 : ఏయూను రూసా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ పోల భాస్కర్ శనివారం సందర్శించారు. రూసా 2.0 పథకంలో భాగంగా నిర్మించిన పలు భవనాలను ఆయన పరిశీలించారు. ఏయూ సొంతంగా పర్యవేక్షణ చేస్తూ... అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేయడాన్ని అభినందించారు. అనంతరం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. సమతతో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూ చూపిన చొరవ, రూసా నిధుల సద్వినియోగం, నాణ్యవంతమైన నిర్మాణాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ తరఫున ఆయన్ను ఇన్‌చార్జి వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి. కృష్ణమోహన్, డీన్ ఆచార్య కె. బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.


రూసా పీడీని సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ సమత

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఆనందపురం జనవరి 6 : గుడిలోవలోని విజ్ఞాన్ విహార్ 44వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ ఏయూ ప్రధానాచార్యుడు ప్రొఫెసర్ ఏవీ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చునన్నారు. కాగా 304 విద్యార్థులు 101 నమూనాలను (సైన్స్‌లో 47, ఆర్ట్స్‌లో 54) ప్రదర్శించారు.

వంద మంది నర్సులకు సన్మానం


నర్సులను సన్మానిస్తున్న ఇన్నర్‌వీల్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, జనవరి 6 : నర్సుల సేవలు అనిర్వచనీయమైనవని కేజీహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేర్ ఆధ్వర్యంలో హానరింగ్ 100 నర్సస్ పేరిట వంద మంది నర్సులను శనివారం సన్మానించారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు శస్త్ర చికిత్స మాత్రమే చేస్తారని, అంతకుముందు, తర్వాత రోగిని జాగ్రత్తగా చూసుకునేది నర్సులేనని చెప్పారు. ప్రత్యేక అతిథి, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఎన్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నర్సుల సేవలను వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శోభారాణి, కన్వీనర్ లక్ష్మి ప్రసూనా, కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా గవర్నర్ అరుణశ్రీ, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వల్లీ రామ్ గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం : సీఐ

ఆరిలోవ, జనవరి 6 : విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, అది లేకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుందని దిశ పోలీస్ స్టేషన్ సీఐ శైలజ, ఆరిలోవ సీఐ సోమశేఖర్ అన్నారు. శనివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు అందజేశారు.


మాట్లాడుతున్న దిశ పీఎస్ సీఐ శైలజ

కలెక్టర్‌ను కలిసిన ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ మురళీకృష్ణ శనివారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన మురళీకృష్ణ డాక్టర్ రాజేష్ స్థానంలో నియామితులయ్యారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దళారీలను నమ్మొద్దు

» జోన్-3 ఈఈ శ్రీనివాసరావు » సిబ్బందితో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న జోన్-3 ఈఈ శ్రీనివాసరావు

పద్మనాభం, జనవరి 6 : రైతులు ఎటువంటి డిపాజిట్ చెల్లించకుండానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని మధురవాడ జోన్-3 ఈఈ (ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. పద్మనాభం సబ్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఆయన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మరు,మూడు స్తంభాలు, 180 మీటర్ల కండక్టరు ఉచితంగానే ఇస్తామన్నారు. దీనికోసం ఎటువంటి అదనపు డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. హార్స్‌పవర్‌కు రూ. రెండు వేలు, ప్రాసెసింగు ఫీజు రూ. 40, సర్వీస్ ఛార్జీ రూ.25 మాత్రమే చెల్లించాలన్నారు. ఇంతకుమించి సిబ్బంది అదనంగా అడిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా సర్వీసు ఇస్తామన్నారు. రైతులకు తొమ్మిది గంటల పగటి పూట విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా లైను మరమ్మతులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. పద్మనాభంకు త్వరలోనే పూర్తిస్థాయి ఏఈని నియమిస్తామన్నారు. ఆయనతో పాటు ఆనందపురం ఏడీఈ కిరణ్ కుమార్, మధురవాడ ఏఏఓ బంగారునాయుడు, ఇన్‌ఛార్జి ఏఈ సురేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు అప్పలనాయుడు

తగరపువలసలో అంగన్‌వాడీల నిరసన దీక్ష

తగరపువలస, జనవరి 6 : స్థానిక తాతా థియేటర్ వద్ద అంగన్‌వాడీలు శనివారం నుంచి నిరసన దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ అధ్యక్షుడు అప్పలనాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేపట్టి 26 రోజులు కావస్తున్నా.ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యకర్తలను హెచ్చరిస్తూ ప్రత్యామ్నాయం చూస్తామని విడుదల చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన తరువాత అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని, మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మ, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, లక్ష్మి, అనురాధ, ధనలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

భూముల సర్వే అడ్డగింపు


సర్వేను అడ్డుకుంటున్న కార్మిక నాయకులు

తగరపువలస, జనవరి 6 : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం తన ఆధీనంలో ఉన్న భూములను సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయడంతో సర్వేయర్ కృష్ణారావు సిబ్బందితో వచ్చి శనివారం సర్వే చేయించారు. ఈ విషయం తెలుసుకున్న కార్మిక నాయకులు సర్వేను అడ్డుకున్నారు. తమకు బకాయిలు చెల్లించకుండా సర్వే చేయడం ఏమిటని ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, తదితరులు ప్రశ్నించారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించిన తరువాతే భూములను సర్వే చేయాలన్నారు. దీంతో రెవెన్యూ సిబ్బంది విషయాన్ని తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలియజేసి, అక్కడి నుంచి వెనుదిరిగారు.

రూ.6.5 కోట్లతో చిల్లపేట చెరువు అభివృద్ధి


చెరువు పనులను పరిశీలిస్తున్న జడ్సీ రాము

భీమునిపట్నం (రూరల్), జనవరి 6 : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో ఉన్న చిల్లపేట చెరువు అభివృద్ధికి రూ 6. 50 కోట్లు విడుదలయ్యాయని జోనల్ కమిషనర్ బి. రాము తెలిపారు. శనివారం ఆయన చెరువులో జరుగుతున్న పూడికతీతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చెరువు గట్టు ఎత్తు చేశామని, ఇప్పుడు పూడికతీత చేపట్టి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో ట్యాంక్‌బండ్ మాదిరిగా చెరువును అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, రెండవ వార్డు కార్యదర్శి సీహెచ్ వంశీ, గణేష్, సచివాలయ కన్వీనరు వెంకట అప్పారావు,రాజారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొమ్మాది, జనవరి 6 : ముఖ్యమంత్రి జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన 5 వార్డు అయ్యప్పనగర్, 6వ వార్డు పీఎంపాలెం అవంతి ఫంక్షన్ హాల్‌లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కె. కనక మహాలక్ష్మి, 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, నాయకులు ముత్తంశెట్టి మహేష్, పోతిన ప్రసాదు, పోతిన హనుమంతు, పిళ్లా కృష్ణ మూర్తిపాత్రుడు, పిళ్లా రమణ, సంజీవ్, ఎల్లాజీ, గాదె రోసిరెడ్డి పాల్గొన్నారు. కాగా శివశక్తినగర్ రోడ్డు అయ్యప్పనగర్ వద్ద ప్రధాన రహదారిపై కార్యక్రమం ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

సాగర తీరంలో ఫుడ్ ఫెస్టివల్

బీచ్ రోడ్డు/రామ్‌నగర్, జనవరి 6 : సాగర తీరం ఫుడ్ ఫెస్టివల్‌తో సందడిగా మారింది. గత ఏడాదిలానే కాళీమాత గుడి ఎదురుగా వున్న ఇసుక తెన్నెలపై ఫుడ్ ఫీస్ట్ ఏర్పాటు చేశారు. సుమారు 80 స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిల్లో అరకు బొంగులో చికెన్, కోనసీమ రుచులు, రాగి సంగటి, నేతి గారెలు, పూతరేకులు, బొమ్మిడాల పులుసు, టైగర్ రొయ్యలు, గోంగూర బిర్యానీ, మటన్ పులవ్, తదితర అనేక రుచులను అందుబాటులో ఉంచారు. ఆదివారం వరకు ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుందని నిర్వాహకులు చెప్పారు.

అయోధ్య పూజాక్షితలు ఇంటింటికీ పంపిణీ

పద్మనాభం, జనవరి 6 : అయోధ్య రాముడి పూజాక్షితలను రామ భక్తులు శనివారం పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయం నుంచి శోభాయాత్రగా వెళ్లి ప్రతి ఇంటికి అక్షితలను అందజేశారు.